చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయి చేసుకోవడం ఎంత నేరమో అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం అంతే. అమర్యాదగా మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణ రక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం ఉండాలి.

–ఎ.విమలమ్మ, ఏఎన్ఎం, దొప్పలపూడి



వైద్యశాలల్లో మహిళలకు రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జరిగిన లాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృత్తం కాకుండా మహిళా వైద్యులు, సిబ్బందికి సరైన రక్షణ కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యుల రక్షణకు బలమైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. నిరంతరం రోగులకు సేవలందించే మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే విధులు నిర్వర్తించడం కష్టతరమవుతోంది.

– ఎ.రాణిమ్మ, ఏఎన్ఎం దండమూడి

క్లుప్తంగా

నేడు కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నారు. ఈ నెల 17వ తేదీన నిర్వహించిన సాధారణ కౌన్సిల్ సమావేశంలోని అంశాలను ఆమోదించేందుకు గాను సమావేశం నిర్వహించనున్నారు. సభ్యుల 18 ప్రతిపాదనలు, 12 నగరపాలక సంస్థ ప్రియాంబుల్స్‌ను ఆమోదానికై ప్రత్యేక కౌన్సిల్ జరగనుంది.

డాక్టర్ శ్రీనివాస్ సేవలు అభినందనీయం



గుంటూరు మెడికల్: జిల్లా లెప్రసీ నిర్మూలన విభాగంలో ఫిజియోథెరపిస్ట్‌గా వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కొడాలి శ్రీనివాసు ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పలువురు వైద్యాధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది అతడిని సన్మానించి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాసు 35 సంవత్సరాల పాటు జిల్లా లెప్రసీ విభాగంలో కుష్టువ్యాధిగ్రస్తులకు సేవలు అందించటలో ముందు వరసలో నిలబడ్డారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మానిటరింగ్ ఆఫీసర్(నేషనల్ హెల్త్ మిషన్) డాక్టర్ చుక్క రత్న మన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ అన్నపూర్ణ, జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మానాయక్ భూక్యా, లెప్రసీ శాంపిల్ సర్వే యూనిట్ జేఎంఓ డాక్టర్ జయరామకృష్ణ, డాక్టర్ రంగనాథుల రమేష్, జిల్లా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లక్ష్మీకుమారి, నేషనల్ హెల్త్ మిషన్ అకౌంటెంట్ ఆఫీసర్ కృష్ణకుమారి, డెమో జయప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలి



నెహ్రూనగర్: పారిశుద్ధ్య కార్మికుల సమ్మె కాల జీతం, సంక్రాంతి కానుక మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని ది గుంటూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడిని కలసి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మేయర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి తమ సమస్యలను విన్నవించారు. 2023 డిసెంబర్ 26, నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు పారిశుద్ధ్య కార్మికుల నిర్వహించిన సమ్మె కాలానికి సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జీతాలు, సంక్రాంతి పండుగ కానుక ఇప్పించాలని కోరారు. స్పందించిన మేయర్ ప్రజారోగ్య అధికారులతో మాట్లాడి పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ నిర్దేశించిన విధంగా వేతనం, పండుగ కానుక త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముత్యాలరావు, పి.శ్రీనివాసరావు, వై.ప్రభుదాస్, కె.మరియదాసు, జి.శ్రీనివాసరావు, బాల ప్రసాద్, రెహమాన్, బాషా, నాగరాజు, చంటి, వినోద్, సాయి పాల్గొన్నారు.

వెస్ట్ ట్రాఫిక్ సీఐగా సింగయ్య



పట్నంబజారు: గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐగా సిహెచ్.సింగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కి చెందిన ఆయన పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. ఈ ఏడాది సీఐ పదోన్నతి లభించింది. బాపట్ల జిల్లాలో కొద్దిగా నిర్వర్తించిన ఆయన్ని గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ చేయగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

వ్యక్తిపై దాడి

పట్నంబజారు: డబ్బులు ఇవ్వలేదని కారణంతో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. మోతిలాల్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ బాషా ఈనెల 29వ తేదీ రాత్రి నెహ్రూ నగర్ ఒకటో లైన్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వచ్చి డబ్బులు ఎంత ఉన్నాయో ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు. అయితే తన వద్ద డబ్బులు లేవని చెప్పిన బాషాను దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రావణ శుక్రవారం కుంకుమ పూజలు



మల్లికార్జునపేటలో.. కామాక్షీదేవిగా అమ్మవారి దర్శనం



అరండల్‌పేటలో.. బంగారం పుష్పాలతో పూజలు



సిద్ధార్థనగర్.. లక్ష్మీదేవి అలంకరణలో..



అరండల్‌పేట.. కలువలతో పూజలు



సిద్ధార్థనగర్ కనకమహాలక్ష్మి ఆలయంలో సువాసినులతో పూజలు

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట అష్టలక్ష్మీ సమేత లక్ష్మీనారాయణస్వామి దేవస్థానంలో నిర్వస్తున్న శ్రావణమాస కోటి కుంకుమార్చన మహోత్సవాల్లో భాగంగా చివరి శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గోపూజ, శ్రీ చక్ర మేరుకు విశేష అభిషేకార్చనలు నిర్వహించారు. వరలక్ష్మీ అమ్మవారికి 1,100 బంగారు పుష్పాలు, కలువ పూలతో ప్రత్యేక పూజలు చేపట్టారు.

స్థానిక సిద్ధార్థనగర్ కనకమహాలక్ష్మీ మందిరంలో శ్రావణమాస శుక్రవారం సందర్భంగా కనకమహాలక్ష్మి అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించారు.

స్థానిక శ్యామలానగర్ శ్రీసీతారామ దేవస్థానంలో శ్రావణ మాస చివరి శుక్రవారం సువాసినులతో శ్రావణ శుక్రవార వ్రతాలను వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

గుంటూరు ఎడ్యుకేషన్: మల్లికార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారు కంచి కామాక్షీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకస్వామి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి విశేష అభిషేకం, అలంకరణతో పాటు అమ్మవారిని కామాక్షిదేవిగా విశేష అలంకరణ చేశారు.

పది వేల మొక్కలు నాటడానికి చర్యలు



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే నసీర్

నెహ్రూనగర్: రాష్ట్ర ప్రభుత్వం పచ్చదనం పెంపునకు చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పది వేల మొక్కలను నాటడానికి కార్యాచరణ సిద్ధం చేశామని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ వెంకటలక్ష్మి తెలిపారు. గుంటూరు నగరంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా మొక్కలు నాటడానికి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ నల్ల చెరువు వాకింగ్ ట్రాక్ లోను, పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి శ్రీరామ్ నగర్‌లో మొక్కలను నాటారన్నారు. నగరంలో మొక్కల నాటడానికి పేరేచర్లలోని అటవీ శాఖ నుంచి పది వేల మొక్కలను తీసుకున్నామని, రోడ్ మార్జిన్లలో నాటడానికి వీలుగా 5 అడుగుల పైన ఉన్న 1000 మొక్కలను కడియం నర్సరీ నుంచి తెప్పించామన్నారు. ప్రధానంగా కాలనీల్లో అంతర్గత రోడ్లు, చెరువు కట్టలు, వాకింగ్ ట్రాక్‌లు, కాలనీల్లోని ఖాళీ స్థలాలు, పార్క్‌ల్లో మొక్కలను నాటేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజలు కూడా వన మహోత్సవంలో పాల్గొని ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని పరిరక్షించాలన్నారు.

వర్షంలో కమిషనర్ పర్యటన

నెహ్రూ నగర్: వర్షాల వలన ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి అమరావతి రోడ్, లక్ష్మీపురం, కోబాల్ట్ పేట, పీకల వాగు తదితర ప్రాంతాల్లో అధికారులతో కలసి పర్యటించారు. అధికారులు అందుబాటులో ఉండి, కాల్ సెంటర్‌కి ప్రజల నుంచి వర్షాలపై అందే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు.



శుక్రవారం రాత్రి నగరంలో పర్యటిస్తున్న నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

అభ్యుదయ భావాల ఉద్యమనేత నరసింహారావు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



నరసింహారావు సంస్మరణ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అభ్యుదయ, వామపక్ష భావాల ఉద్యమనేతగా నరసింహారావు అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ సంఘ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పౌర సమాజ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్వీ నరసింహారావు సంస్మరణ సభను శుక్రవారం బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య విద్యా సంస్థల సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అధ్యాపక ఉద్యమనేతగానే కాకుండా, వామపక్ష భావజాలంతో పౌర హక్కుల సంఘ నేతగా కడదాకా జీవించిన నరసింహారావు వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని కొనియాడారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ నమ్మిన ఆశయాల సాధన కోసం జీవితకాలం కృషి చేసిన మహనీయుడని నివాళులర్పించారు. చరిత్ర కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సోమశేఖరరావు చరిత్ర కాంగ్రెస్ ఉద్యమ నిర్మాణంలో దశాబ్దాలుగా నరసింహారావు క్రియాశీలకంగా వ్యవహరించారని కొనియాడారు. జిల్లా చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.శామ్యూల్ అధ్యక్షత వహించిన సభలో సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు వైఎస్‌సీ బోస్, కార్యదర్శి డాక్టర్ మంచాల బోసుబాబు, సీఎస్ఆర్ ప్రసాద్, వి.లక్ష్మణరెడ్డి, సీనియర్ న్యాయవాది చెరుకూరి సత్యనారాయణ, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు లక్ష్మి, జ్యోతిర్మయి, సుధామయి, నరసింహారావు, అభిమానులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు



డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమా సుల్తానాను అభినందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: హోప్ విన్ హాస్పిటల్స్ నాలుగో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం స్థానిక గుంటూరువారి తోట ఏడోలైనులో హాస్పిటల్‌లో ఘనంగా నిర్వహించారు. హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నజీరుద్దీన్, హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానా కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్పిటల్ ప్రారంభించిన నాలుగేళ్ల కాలంలో హోప్ విన్ హాస్పిటల్స్ ప్రజలు మన్ననలు పొందగలిగిందన్నారు. ప్రజా ఆరోగ్యమే ప్రథమ కర్తవ్యంగా భావించి తాము నాలుగేళ్లపాటు చేసిన పలు సేవా కార్యక్రమాలు తమకు చాలా సంతోషాన్నిచ్చాయన్నారు. కేవలం పది రూపాయలకే ఓపీ వైద్యసేవలు, వైద్య పరీక్షల్లో, చికిత్సల్లో రాయితీలు అందించి ఎంతో మంది పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు చేరువ చేశామన్నారు. యువనారీస్ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అనేక ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు కూడా ఉచితంగా అందించినట్లు పేర్కొన్నారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తుగా యువతకు, మహిళలకు, విద్యార్థినులకు పలు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. పిల్లల చదువులకు సాయం చేశామని తెలిపారు. తాము చేసిన సేవలకు గాను 100 పైగా అవార్డులు వచ్చాయన్నారు. డాక్టర్స్, వైద్య సిబ్బంది, మేనేజర్ నాగేశ్వరరావు, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ షమ సుల్తానాలను బొకేలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుందాం



సంప్రదాయ వస్త్రధారణ విద్యార్థినులతో చక్రనాగ్, కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో పండుగల రూపంలో ప్రజల్లో ఆరోగ్యం, ఐక్యమత్యం, నాగరికత ఇమిడి ఉన్నాయని తద్వారా సంస్కృతి, సంప్రదాయాలు అనాదిగా పరిఢవిల్లుతున్నాయని ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల్లో శ్రావణమాసంలో చివరి శుక్రవారం సందర్భంగా పూజ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు అచ్చ తెలుగు సంప్రదాయం ఉట్టిపడే విధంగా పట్టు పరికిణీలు, పావడాలు ధరించి సందడి చేశారు. చక్రనాగ్ మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా ప్రతి ఇంట్లో నిష్ఠగా వరలక్ష్మీ వ్రతాన్ని తప్పనిసరిగా కుటుంబ సమేతంగా జరుపుకోవడం ద్వారా ధనలక్ష్మీ కటాక్ష సిద్ధిని పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బెనిఫిట్స్ త్వరగా అందించేందుకు చర్యలు



జిల్లా ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్‌కు విన్నవిస్తున్న రిటైర్డు ఏఎస్ఐ రామకోటేశ్వరరావు

నగరంపాలెం: పోలీస్ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్ అన్నారు. జిల్లాలో విశ్రాంత పోలీస్ అధికారులు, సిబ్బంది, చనిపోయిన పోలీస్ వారి కుటుంబ సభ్యులతో శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ మాట్లాడుతూ బెనిఫిట్స్‌కు సంబంధించి ధ్రువపత్రాలను డీపీఓలో అందజేయాలని అన్నారు. మన అందరిది ఒకే కుటుంబమని, ఏవైనా సమస్యలు ఉన్నట్‌లైతే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు నేరుగా చెప్పవచ్చునని వివరించారు. తొలుత కుటుంబ యోగా క్షేమాలు, ఆర్థిక పరిస్థితులు, పిల్లల చదువులు, ఆరోగ్య పరిస్థితులపై డీఎస్పీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యలను రిటైర్డు ఏఎస్ఐ రామకోటేశ్వరరావు విన్నవించారు. సమావేశంలో డీపీఓ ఏఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ హిందూ ఫార్మసీ కళాశాల



ప్రతిభ చూపిన విద్యార్థులతో జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన అంతర్ ఫార్మసీ కళాశాలల ఆటల పోటీల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం మాట్లాడుతూ 20 ఫార్మసీ కళాశాలల నుంచి 500 మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా, తమ కళాశాల విద్యార్థులు క్యారమ్స్, క్యారమ్స్ మిక్స్‌డ్, అంత్యాక్షరిలలో ప్రథమ స్థానంతో పాటు చెస్, డంషరాడ్స్‌లో తృతీయ స్థానంతో ఓవరాల్ చాంపియన్లుగా ఎంపికై ట్రోఫీ, నగదు బహుమతి సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పి.సీతారామయ్య, ఎ.ప్రత్యూష, ఫిజికల్ డైరెక్టర్ సీహెచ్ అజితబాబు విద్యార్థులను అభినందించారు.

మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: వర్క్‌షాపులు నిర్వహించటం వలన విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత మెరుగు పరచవచ్చని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శుక్రవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో కళాశాల, ఐఏఎసీ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ సంస్థల సంయుక్తంగా విద్యార్థులకు సేల్స్ మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు ముగింపు వేడుకల్లో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి చెందాలంటే ముందుగా మార్కెటింగ్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వై4డీ ఫౌండేషన్ ప్రతినిధులు జీ బెనర్జీ, వినయ్, శ్రీనివాస్ మార్కెటింగ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.షారోన్‌రోజ్, డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, జి.రాధిక, జె.ప్రమీల పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ సిబ్బంది, పలువురు విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ వ్రతమంటే నియమబద్ధమైన నడవడిక, క్రమశిక్షణతో కూడిన ఆచరణ, వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ప్రాముఖ్యాన్ని తెలియజెప్పడమే వ్రతం ఆంతర్యమన్నారు. జీవితంలో ఏ బాధ్యతల్ని స్వీకరించినా ఉత్తమంగా నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య సతీమణి లావు నిర్మల, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.